# హరిత గృహాల పరిశీలన



గోలేటిటౌన్‌షిప్‌లో హరిత గృహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రెబ్బెన, డిసెంబర్ 20: ఈ నెల 23న నిర్వహించే సింగరేణి ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని బుధవారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్ కార్మికకాలనీ, సీ టైప్, బీ టైప్, బంగ్లాస్ ఏరియాలలో హరిత గృహలను పరిశీలించినట్లు బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. మండల శ్రీనివాస్(సీనియర్ పీవో-పర్సనల్ డిపార్టుమెంట్), ఫారెస్ట్ అఫీసర్ నవీన్, ఎన్వీరాన్‌మెంట్ ఆధికారి హరీశ్‌లతో కూడిన బృందం హరిత గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరి ఇండ్లకు వెళ్లి పచ్చదనం, పరిశుభ్రతతో కూడిన గృహాలను పరిశీలించారు. ఉత్తమ హరిత గృహాలుగా ఎంపికైన వారికి ఆవిర్భావ దినోత్సవం రోజున బహుమతులు అందిస్తామని వారు తెలిపారు.

# డిజిటల్ లావాదేవీలపై అవగాహన



పెంచికల్ పేట్ : ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్ రాజేశ్వరరావు

పెంచికల్ పేట్,డిసెంబర్20: బ్యాంకు ఖాతాదారులు ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రాజేశ్వరరావు అన్నారు. మంగళవారం పెంచికల్‌పేట్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఖాతాదారుడు లైఫ్ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు. క్రాఫ్ లోన్, గోల్డ్ లోన్, ఇంటి రుణాలు, మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎం వినియోగం వంటి వాటిపై వివరించారు. బ్యాంకుల పేరుతో సైబర్ నేరాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఖాతాదారునిపై ఉందని చెప్పారు. అనంతరం కళాజాతా బృందం ఆటపాటల ద్వారా సైబర్ మోసాలపై ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కమల, ఫీల్డ్ ఆఫీసర్ గోపి కిషోర్, కళాజాతా బృందంసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రికార్డులను సక్రమంగా నమోదు చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ కరుణాకర్

పెంచికల్‌పేట్,డిసెంబర్29 : పోలీస్ స్టేషన్‌లో నమోదైన ప్రతి కేసు రికార్డులను సక్రమంగా పొందుపర్చాలని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను,పరిసరాలను పరిశీలించారు. అనం తరం ఆయన మాట్లాడుతూ, విధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ అంకితభావంతో పనిచేయాలన్నారు. కేసుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలతో మమేకంగా ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండ గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఆయనతోపాటు రూరల్ సీఐ నాగరాజు, ఎస్సై కొమరయ్య సిబ్బంది పాల్గొనన్నారు.

# బొలెరోపై నుంచి జారి పడి యువతి మృతి

చింతలమానేపల్లి , డిసెంబర్ 20 పత్తి తీసేందుకు కూలీ పనికి వెళ్తుండగా గంగాపూర్ సమీపంలో బొలెరో వాహనం నుంచి జారి పడి యువతి మృతి చెందిన ఘటన మండలంలోని గంగాపూర్ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. బాలాజీ అనుకోడ గ్రామ పంచాయతీ పరిధిలోని పాల్వాయి నగర్‌కు చెందిన దుర్గం అంకులు, మీనా దంపతుల రెండో కూతురు అఖిల (19)పత్తి తీయడానికి తల్లి మీనాతో పాటు తోటి కూలీలతో కలిసి బొలెరో వాహనంలో వెళ్లింది. చేనుకు వెళ్తున్న క్రమంలో బొలెరో వాహనం పై నుంచి ప్రమాదవశాత్తు జారి రోడ్డుపై పడడంతో తలకు బలమైన దెబ్బ తగలడంతో ఆమె స్పృహ కోల్పోగా తల్లి మీనాతో పాటు తోటి కూలీలు వెంటనే అదే వాహనంలో కౌటాల లోని దవాఖానాకు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. తండ్రి దుర్గం అంకులు జార్ఖండ్‌లో ఉండడంతో ఆయన రాక కోసం వేచి చూస్తున్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 20: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 8 వ తరగతి చదువుతున్న విద్యార్థి భూపతి నాగరాజు (ఎస్జీఎఫ్ఐ) అండర్ 14 రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఊటూరి శ్రీనాథ్ తెలిపారు. నవంబర్ 7న ఉట్నూర్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి ఈ నెల 20 నుంచి 21 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థిని ఉపాధ్యాయులతో కలిసి ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ సట్ల శంకర్, ఎస్జీఎఫ్ఐ కార్యదర్శి సాంబశవరావు, హౌస్ మాస్టర్ సంపత్, పీఈటీ కోట యాదగిరి తదితరులు ఉన్నారు.

**• రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు..**

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 20: జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని బి.సాయి దీక్ష , సిర్పూర్ (యూ) ఆదర్శ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని జే.లోకేశ్వరి రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఆసిఫాబాద్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, సిర్పూర్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటస్వామి తెలిపారు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో మంగళవారం నిర్వహించిన జోనల్ స్థాయి కబడ్డీ పోటీల్లో అండర్ 17 విభాగంలో జిల్లా జుట్టుకు ప్రాతినిధ్యం వహించి జోనల్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. సాయి దీక్ష ,లోకేశ్వరి ఈ నెల 21,22,23వ తేదీల్లో హన్మకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఇరు పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సిర్పూర్ (యూ) ఆదర్శ పాఠశాల పీడీ ఆత్రం ధర్మారావు అభినందించారు.

## సోలార్ హీటర్లకు మరమ్మతులు చేపించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 20: జిల్లాలోనీ ఆశ్రమ పాఠశాలలో పాడైపోయిన సోలార్ హీటర్లకు మరమ్మతులు చేసి విద్యార్థులకు అందుబాటులో తీసుకురావాలని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దుర్గం దినకర్ జిల్లా కమిటీ సభ్యుడు గొడిసేల కార్తిక్ మాట్లాడుతూ, జిల్లాలో ఆశ్రమ పాఠశాలలలో ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన సోలార్ హీటర్లకు మరమ్మతులు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు.



కాలువల గుండా వృథాగా పోతున్న నీరు



కాలువలో నిండుగా పేరుకపోయిన కోరేగడ్డి

# యాసంగికి సాగునీరు అందేనా..

*12సంవత్సరాల క్రితం 2000ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూర్‌లో బొక్కివాగు ప్రాజెక్టు నిర్మించారు. దానికి కుడి, ఎడమ రెండు కాలువలు ఏర్పాటు చేసి పంట పొలాలకు నీరు అందిస్తున్నారు. అయితే రెండు కాలువలు అక్కడక్కడ గోడలు కూలిపోవడమే కాకుండా కాలువల నిండా కోరేగడ్డి పేరుకపోయింది. కొంతమంది రైతులు ఇష్టారీతిగా తూములు తెరిచి సరిగా మూయక పోవడంతో నిత్యం నీరు కాలువల గుండా వృథాగా పోతున్నది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువలకు మరమ్మతులు చేసి, నీటిని వదిలేందుకు ఒక నీరటిని నియమించాలని రైతులు కోరుతున్నారు.- పెంచికల్‌పేట్,డిసెంబర్ 20*



బొక్కి వాగు ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు

- **కూలిపోతున్న కాలువల గోడలు, పేరుకపోతున్న కోరేగడ్డి**
- **కాలువల గుండా వృథాగా పోతున్న నీరు**
- **ఆందోళనలో ప్రాజెక్టు దిగువ రైతులు**

మండలంలోని ఎల్లూరు గ్రామంలో బొక్కివాగుపై గత 12 సంవత్సరాల క్రితం బొక్కి వాగు ప్రాజెక్టును అప్పటి ప్రభుత్వం నిర్మించింది. దాదాపు 2000 ఎకరాల పంట సాగుకు నీరు అందించడమే ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. దానికి రెండు కుడి,ఎడమ కాలువలను ఏర్పాటు చేసి పంట పొలాలకు నీరు అందిస్తున్నారు. ప్రాజెక్టుకు దిగువన ఎల్లూరు, కోయాసిచ్చాల వ్యవసాయ భూములు గల రైతులు పంటలు సాగు చేస్తున్నారు. వానకాలం సీజన్లో 1000 ఎకరాలు, యాసంగి పంట దాదాపు 300 ఎకరాల్లో సాగుకు రైతుల సిద్ధమవుతున్నారు. రెండు కాలువలు అక్కడక్కడ గోడలు కూలిపోవడంతోపాటు కాలువలలో కోరేగడ్డి విపరీతంగా పెరిగింది. మరోవైపు తూములు సరిగా మూయకపోవడంతో కాలువల గుండా నీరు వృథాగా పోతున్నది. దీంతో ప్రాజెక్టులో ఉన్న నీరు యాసంగికి సరిపోతుందా..? పంటలు వేయాలా..వద్దా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### కాలువలకు మరమ్మతులు చేయాలి



ప్రాజెక్టు నుంచి రైతుల పంట పొలాలకు కాలువల ద్వారా నీరు రావలసిన కుడి ,ఎడమ కాలువల గోడలు అక్కడక్కడ కూలిపోతున్నాయి. మరోవైపు కాలువల్లో విపరీతంగా కోరగడ్డి పెరిగింది. కాలువలకు మరమ్మతులు చేపించి కోరేగడ్డి తొలగించాలి. రైతుల పంటకు నీరు అందేవిధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

**-ఎల్లయ్య యువరైతు,ఎల్లూరు**

### నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాలి



బొక్కి వాగు ప్రాజెక్టు కుడి కాలువ నిత్యం నీరు పారుతూ వృథాగా పోతున్నది. తూము ఒకరు బంద్ పెడితే మరోకరు తెరుస్తున్నారు. పంటలకు అవసరం లేకున్నా నీరు వదులుతున్నారు.ప్రాజెక్టు నీటిని వదిలేందుకు ఒక నీరటిని ఏర్పాటు చేసి నీరు వృథాగా పోకుండా అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

**-చంద్రయ్య రైతు ,ఎల్లూరు**

### నీరటిని నియమించాలి



నా పేరు చెన్నబోయిన చిన్నన్న బొక్కి వాగు ప్రాజెక్టు దిగువనే ఐదు ఎకరాల భూమి ఉన్నది. దాంట్లో వరి సాగు చేస్తూ ఏటా రెండు పం టలు పండిస్తున్నాను. నీటిని వదిలేందుకు నీరటి లేకపోవడంతో కొంతమంది రైతులు అవసరం లేకున్నా తూము గేటు తెరిచి నీటిని వృథా చేస్తున్నారు. దీంతో ప్రాజెక్టులో నీరు తగ్గిపోతుంది. ఈ సంవత్సరం చివరి దశలో ప్రాజెక్టు నీరు యాసంగి పంటకు సరిపోతుందా..అని సందేహంగా ఉంది. నీటిని వదిలేందుకు నీరటిని నియమించాలి

**- చిన్నన్న రైతు ,ఎల్లూరు**

## వరకట్న వేధింపులతో ఒకరికి జైలు శిక్ష

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 20 : వరకట్న వేధింపుల కేసులో నిందితుడికి 7 సంవత్సరాల జైలు శిక్షతో పాటు 2 వేల రూపాయల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా జడ్జి ఎం.వీ రమేశ్ బుధవారం తీర్పు ఇచ్చారు. లైసనింగ్ అధికారి సాగర్, కాగజ్‌నగర్ లైసనింగ్ అధికారి బాలాజీ తెలిపిన ప్రకారం.. సిర్పూర్ (టీ) పోలీస్‌స్టేషన్ పరిధిలో 2019లో డోర్పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రామ్‌నగర్‌కి చెందిన సూర ఎల్లక్క ఇచ్చిన ఫిర్యాదుతో అడే మహేశ్ పై కేసు నమోదు చేసి అప్పటి ఎస్ఐ మధుకర్, డీఎస్పీ సుధీంద్ర స్వామిలు విచారణ జరిపి సాక్ష్యాధారాలతో చార్జ్ షీట్ దాఖలు చేసినట్లు వివరించారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్ మోహన్‌రావు ప్రవేశ పెట్టిన సాక్షులను విచారణ చేసి కేసు పూర్వ పరాలను పరిశీలించి నిందితుడు మహేశ్‌కి ఐపీసీ సెక్షన్ కింద 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు 2 వేల జరిమానా విధించారు. కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేసిన పోలీసు అధికారులను ఎస్పీ సురేశ్ కుమార్ అభినందించారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ క్, డిసెంబర్ 20 : విద్యార్థులు క్రీడల్లో సైతం రాణించాలని డీఐఈవో నైతం శంకర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్టాఫ్ బాల్, బేస్‌బాల్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్ల ఎంపిక పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో మంచి ప్రతిభ చూపి జిల్లాకి పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఊటూరి శ్రీనాథ్, పీడీ సట్ల శంకర్, ఉమ్మడి ఆదిలాబాద్ కార్యదర్శి బాబురావు, కోట యాదగిరి, రాకేశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

వాంకిడి, డిసెంబర్20 : విద్యార్థులు, యువతక్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సర్పంచ్ పెందోర్ పవన్ అన్నారు. మండలంలోని ఖామాన గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం సర్పంచ్ ఆధ్వర్యంలో యువకులకు 3 కేసీఆర్ క్రికెట్ కిట్లు, 3వాలీబాల్ కిట్లను గ్రామంలోని క్రీడాకారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పోశం, వార్డుమెంబర్ మనోహర్, ఫీల్డ్ అసిస్టెంట్ దేవిదాస్, కారోబారి అశోక్, క్రీడాకారులు సందీ ప్, భక్తరాజ్, గంగాధర్, నవీన్ ఉన్నారు.

## విద్యార్థులకు అప్రెంటీస్ సౌకర్యం కల్పించాలి

రెబ్బెన, డిసెంబర్ 20: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ మొదలగు కోర్సులు చదువుతున్న విద్యార్థులకు జిల్లా ప్రభుత్వ అసుపత్రిలో అప్రెంటీస్ సౌకర్యం కల్పించాలని రెబ్బెన జడ్పీటీసీ వేముర్ల సంతోష్ కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అసుపత్రి సుపరింటెండెంట్ చెన్న కేశవులను బుధవారం కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ కోర్సులు పూర్తి చేసిన వారు అప్రెంటీస్ చేస్తేనే నర్సు, ల్యాబ్ టెక్నిషియన్ మొదలగు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హులు కాబట్టి వారికి అప్రెంటీస్ సౌకర్యం కల్పించాలని కోరారు.

## జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 20 : ఈ నెల 22న ఆసిఫాబాద్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ మందుల కంపెనీ శ్రీ విజయ బయో ఫర్టిలైజర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 60 సెల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల కోసం ఎంపికలు జరుగు తాయని, ఇంటర్మీడియట్ ఆపై చదువుకున్నవారు అర్హులని ఆయన తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# పథకాలను సద్వినియోగించుకోవాలి



కెరమెరి: బ్యాంకులో అమలవుతున్న పథకాలను వివరిస్తున్న అధికారి కార్తీక్

కెరమెరి, డిసెంబర్ 20: ప్రభుత్వశాఖలో అమలవుతున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు. బుధవారం మండలంలోని ఝరి గ్రామంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అధికారులు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ అధికారి కార్తీక్ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన ద్వారా ఎలాంటి డబ్బులు చెల్లించకుండా బ్యాంక్‌లో ఖాతాలు తెరిచే అవకాశం కల్పించిందన్నారు. దీంతో పాటు బ్యాంకు ఖాతాదారులకు తక్కువ డబ్బులతో జీవన్ జ్యోతి, సురక్ష యోజనతో బీమా సౌకర్యం కల్పించిందని చెప్పారు. ఉజ్వల పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం మహిళల పేరిట ఉచితంగా గ్యాస్ మంజూరు చేస్తుందని, లబ్ధిదారులు 5 సంవత్సరాలకు ఒకసారి ఈకేవైసీ చేసుకోవాలని భారత్ గ్యాస్ సిబ్బంది భాస్కర్ పేర్కొన్నారు. ఇప్పటికి ఆసిఫాబాద్ పరిధిలో 3వేలు ఉచిత గ్యాస్ కనెక్షన్‌లు ఇచ్చామని, ఇంకా ఎవరికైనా కావాల్సి వస్తే ఆధార్ కార్డుతో పాటు బ్యాంక్ అకౌంట్, 5 పాస్ ఫొటోలు అందించాలని ఆయన కోరారు. గ్రామీణ ప్రాంతంలో ప్రజల కోసం ఏర్పా టు చేసిన బస్తీ దవాఖానలను సద్వినియోగం చేసుకోవాలని మోడి హెచ్‌డబ్ల్యూసీ ప్రణయ్ పల్లవి తెలిపారు. అన్ని రకాల మందులతో పాటు రక్త పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అం దించడమే బస్తీ దవాఖాన ముఖ్య ఉద్దేశమన్నారు. ఏఈవో వెంకటేశ్ మాట్లాడుతూ రైతులకు కేంద్ర ప్రభుత్వం అందించే కిసాన్ సమ్మాన్ నిధి కోసం ఈకేవైసీ చేసుకోవాలన్నారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలను రైతులకు అందిస్తున్నామని చెప్పారు. అనంతరం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను అధికారులు విడుదల చేశారు. కార్యక్రమంలో ఝరి సర్పంచ్ కుమ్రం నాణేశ్వర్ అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

**• కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన**

రెబ్బెన, డిసెంబర్ 20: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై భారత్ వికాసిత్ సంకల్ప్ యాత్ర ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు నోడల్ అఫీసర్ సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మిపూర్, పాసిగాం గ్రామ పంచాయతీల్లో బుధవారం యాత్రలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయుష్మాన్ భారత్, గరీబ్ కల్యాణ్, ఉజ్వల యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడెట్ కార్డు, బీమా పథకాలు పాటు పలు పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్యాంరావు, శ్రీనివాస్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, హెల్త్ సుపర్‌వైజర్ ప్రవీణ్, ఏఈవో రాకేశ్ పలువురు ఉన్నారు.

# కార్మికులకు రెండు గుంటల స్థలం ఇప్పిస్తాం

- **టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు**



గోలేటి డిస్పెన్సరీ లో మాట్లాడుతున్న మల్రాజు శ్రీనివాసరావు

రెబ్బెన, డిసెంబర్ 20: సింగరేణిలో టీబీజీకేఎస్ యూనియన్‌ను గుర్తింపు కార్మిక సంఘంగా గెలిపిస్తే కార్మికులకు రెండు గుంటల స్థలం ఇప్పించడంతో పాటు ఇన్‌కాంటాక్స్ రికవరీ డబ్బులు తిరిగి ఇప్పిస్తామని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్‌లోని డిస్పెన్సరీ, గోలేటి జీఎం కార్యాలయంలో బుధ వారం ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. సింగరేణి కార్మికులకు కోల్ ఇండియాలో లేని అనేక హక్కులను కల్పించిన ఘనత టీబీజీకేఎస్‌కే దక్కుతుందన్నారు. కేసీఆర్ సర్కారు పుణ్యామా అని తండ్రీ కొడుకుల ఉద్యోగాలు పునరుద్ధరించబడ్డాయని, తెలంగాణ ఇంక్రిమెం ట్, సకల జనుల సమ్మె వేతనం, ఉచిత విద్యుత్, లాభాలవా టా 18 శాతం నుంచి 32 శాతానికి పెంచడం లాంటివి చేసిన ఘనత టీబీజీకేఎస్‌దేనన్నారు. జాతీయ కార్మిక సంఘాలు సింగరేణిలో గెలిస్తే కార్మికులకు ఉన్న అనేక హక్కులు పోవ డం ఖాయమన్నారు. సింగరేణి కార్మికుల హక్కుల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న టీబీజీకేఎస్ బాణం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సంగెం ప్రకాశ్‌రావు, కార్పొరేట్ చర్చల ప్రతినిధి మంగీలాల్, మాజీ ఉపాధ్యక్షుడు నల్లగొండ సదాశివ్, జీఎం కమిటీ సభ్యులు మాంతు సమ్మ య్య, మారిన వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, ఏరియా అసిస్టెంట్ కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి, ఏరియా నాయకులు రాజేశం, ములకల చంద్రయ్య, జీఎం కార్యాలయ ఫిట్ కార్యదర్శి గడ్డం రవీందర్, డిస్పెన్సరీ ఇన్‌చార్జి మండల శ్రీనివాస్, కమిటీ సభ్యులు యుగంధర్, వెంకయ్య, దేవేందర్, ఆవుల శ్రీనివాస్, ఓరం కిరణ్, దుంపల బాపు, కైత స్వామి, ధన్‌కుమార్, నవీన్, సాలిగామ రవి, దుర్గం వెంకటేశ్వర్లు, ఆరె నాని, సౌందర్య, అర్చనలతో పాటు పలువురు ఉన్నారు.

**• ఒప్పందాలను సింగరేణిలో అమలు చేపిస్తాం**

సింగరేణిలో హెచ్‌ఎంఎస్ యూనియన్‌ను గుర్తింపు కార్మిక సంఘంగా గెలిపిస్తే కోల్ ఇండియా ఒప్పందాలను సింగరేణిలో అమలు చేపిస్తామని బెల్లంపల్లి ఏరియా హెచ్‌ఎంఎస్ ఉపాధ్యక్షుడు పత్తెం రాజబాబు స్పష్టం చేశారు. ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో బుధవారం ఏర్పా టు చేసిన సమావేశంలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. మెరుగైన ఒప్పందాలు, ప్రమోషన్ పాలసీలు, ఆదాయపు పన్ను రియంబర్స్‌మెంట్, కార్పొరేట్ వైద్యం అందించడం కోసం కృషి చేస్తామన్నారు. కోల్ ఇండియా బొగ్గు గని కార్మికులకు వర్తిస్తున్న ప్రతి ఒప్పందం కూడా సింగరేణిలో అమ లు చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆర్గనైజర్ మరిశెట్టి దత్తు, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి కిష్టస్వామి, షిఫ్ట్ ఇన్‌చార్జి రాజు, ఆర్గనైజర్స్ ఓంకార్, సాహిత్‌లతో పాటు పలువురు ఉన్నారు



వాంకిడి: పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో శివకుమార్

## నర్సరీల పరిశీలన

వాంకిడి,డిసెంబర్ 20: మండలంలోని లక్ష్మిపూర్, ఖమాన గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో చేపడుతున్న పనులను ఎంపీడీవో శివకుమార్ బుధవారం పరిశీలించారు. దీంతో పాటు గ్రాపంచాయతీల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో 10వేలకు తగ్గకుండా మొక్కలు పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరతరగతిన బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తిచేసి విత్తనాలు వేయాలన్నారు. మొక్కల ఎదుగుదలకు అవసరమైన జీవామృతం తయారు చేసుకోవాలని సూచించారు. అందుకు అవసరమైన సామగ్రిని సమకూర్చుకోవాలని ఆయా జీపీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు,ఫీల్డ్ అసిస్టెంట్, నర్సరీ నిర్వాహకులు పాల్గొన్నారు.

## వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



కౌటాల: వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న క్రైస్తవ మత ఫాదర్ టోం

కౌటాల, డిసెంబర్ 20: డయాసిస్ ఆఫ్ ఆదిలాబాద్ వారి ఆధ్వర్యంలో మండలంలోని తాటినగర్‌లో బుధవారం 50 మంది వృద్ధులకు దుప్పట్లను కౌటాల ఇన్‌ఫంట్ జీసస్ ఇంగ్లిష్ మీడియం ప్రధానోపాధ్యాయులు ఫాదర్ టోం ధామస్ పంపిణీ చేశారు. డయాసిస్ ఆఫ్ ఆదిలాబాద్ వారి సౌజన్యంతో వృద్ధులకు పేదలకు పలు సేవా కార్యక్రమాలను చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట సిస్టర్ ఆలీ, తదితరులు ఉన్నారు.

**• ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో..**

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 20: జిల్లా కేంద్రంలోని నిర్మల మాత కాథలిక్ చర్చి ఫాదర్ మనోజ్ డయసిస్ ఆఫ్ ఆదిలాబాద్ వారి ఆధ్వర్యంలో రవిచంద్ర కాలనీలోని 15 పేద కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ మాట్లాడుతూ, జిల్లాలో చలి తీవ్రత అధికంగా ఉన్నందున పేద కుటుంబాకు దుప్ప ట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్చి సభ్యులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి




సిర్పూర్(టీ): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ మానేపల్లి బాపు

సిర్పూర్(టీ), డిసెంబర్ 20 : మండలంలోని రైతులందరూ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మానేపల్లి బాపు పేర్కొన్నారు. బుధవారం మండలకేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో కొనుగోలు కేంద్రాన్ని డైరెక్టర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి రైతు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమంలో సహకార సంఘం డైరెకర్లు నేరెళ్ల అశోక్, నగరాడే రాజు, అజ్మేర మహేశ్, అంజన బాయి, , ఏఈవోలు కవిత, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం



ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్: అవిశ్వాస తీర్మానాన్ని డీఆర్డీవో సురేశ్ కు అందజేస్తున్న కౌన్సిలర్లు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 20: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ చైర్మన్ సద్దాం హుస్సేన్, వైస్ చైర్మన్ గిరీశ్‌పై మున్సిపాలిటీ కౌన్సలర్లు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. బుధవారం తీర్మాన పత్రాన్ని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో డీఆర్డీవో కదం సురేశ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చైర్మన్, వైస్ చైర్మన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. అంతేగాక ఏ పనిలోనూ కౌన్సిలర్లకు సహకరించడం లేదని వాపోయారు. దీంతో 24 మంది కౌన్సలర్ల మద్దతుతో చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీలోని 24 వార్డులకు సంబంధించిన కౌన్సిలర్లు ఉన్నారు.

**• చర్చనీయాంశంగా అవిశ్వాసం**

కాగజ్‌నగర్, డిసెంబర్ 20: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ చైర్మన్ పదవికి అవిశ్వాసం పెట్టడానికి రంగం సిద్ధమవడంతో పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 30 వార్డులు ఉండగా అందులో 22 మంది బీఆర్ఎస్, 6 కాంగ్రెస్, ఇద్దరు స్వతంత్ర కౌన్సిలర్లు గెలుపొందారు. చైర్మన్ పదవికి ఇద్దరి మధ్య పోటీ ఉండడంతో బడా నాయకుల సమక్షంలో టాస్ వేసి రెండున్నర ఏళ్లు ప్రస్తుత చైర్మన్ సద్దాం హుస్సేన్, రెండున్నరేళ్లు ప్రస్తుత వైస్ చైర్మన్ రాచకొండ గిరిశ్‌కుమార్ చైర్మన్‌గా కొనసాగాలని తీర్మానించారు. అయితే రెండున్నరేళ్లు పూర్తి అయినప్పటికీ చైర్మన్ పదవి నుంచి వైదొలగకుండా కొనసాగడంపై వైస్ చైర్మన్ గిరిశ్ కుమార్ అసహనం వ్యక్తం చేస్తున్నారు. అసంతృప్తిగా ఉన్న కౌన్సిలర్లతో పాటు మరి కొందరు కౌన్సిలర్లు మొత్తం 24 మంది కౌన్సిలర్లు బుధ వారం అవిశ్వాస తీర్మాన పత్రాన్ని జిల్లా కార్యాలయంలో అం దించారు. ఆవిశ్వాసం నెగ్గితే నెక్ట్స్ చైర్మన్ ఎవరు..? అన్న చర్చ జోరుగా జరుగుతున్నది. కొద్ది రోజులుగా రహస్య మంత నాలు, బుజ్జగింపులు, ముడుపుల విషయాలు చర్చకు వచ్చిన ట్లు పట్టణంలో ప్రచారం జరుగుతోంది. ఆవిశ్వాసం ఎంత వరకు నెగ్గుతుంది..నెక్స్ట చైర్మన్ ఎవరు అన్నది వేచి చూడాల్సిందే.